# రిస్కు 10%..అవకాశం 100%

**మన షేర్లకు ఆకాశమే హద్దు ● ఐరోపా చిక్కుముళ్లు మనకు మేలుచేస్తాయి ● దీర్ఘకాలిక పెట్టుబడులకు మంచి తరుణమిది**

పి.జయప్రకాశ్

**దాదాపు 20 ఏళ్ల కిందటి మాట.**

ఒకరోజు ఇద్దరు చార్టర్డ్ అకౌంటెంట్లు నా ఆఫీసుకు వచ్చారు. వారిద్దరూ నా స్నేహితులే. మాటల్లో స్టాక్ మార్కెట్ విషయాలు చర్చకొచ్చాయి. ఉభయులూ భిన్న వాదనలు వినిపించారు.



వారిలో ఒకరు ఎల్ అండ్ టీ షేర్లను కొనుగోలు చేస్తే, అదే సమయంలో మరొకరు విక్రయించారు (షార్ట్ సెల్ చేశారు). 2 నెలల తర్వాత ఇద్దరికీ లాభాలే వచ్చాయి. అంటే స్టాక్ మార్కెట్ ఇద్దరికీ అవకాశం ఇచ్చిందన్నమాట. మార్కెట్లో వైచిత్రి ఇదే.

మదుపర్లు తామెలాంటి నిర్ణయం తీసుకున్నా.. దానికి కట్టుబడి ఎదురుచూస్తేనే మంచి ఫలితాలు అందివస్తాయి అనేందుకు ఇదో ఉదాహరణ. స్టాక్‌మార్కెట్లో బుల్స్, బేర్స్ మాత్రమే డబ్బు సంపాదిస్తారు. ఇతరులు పోగొట్టుకుంటారు అని చాలామంది అనుకుంటారు. కానీ డబ్బు పోగొట్టుకునేది అందరూ కాదు, కేవలం దృఢ విశ్వాసం లేనివారేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ప్రస్తుతం స్టాక్ మార్కెట్‌ను అంతర్జాతీయ పరిణామాలు ప్రభావితం చేస్తున్నాయి. దీంతో మార్కెట్ గమనాన్ని అంచనా వేయడం కష్టంగా మారింది. మార్కెట్ పడిపోతుందని చాలామంది అంటుంటే.. కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి మరెంతోమంది ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ మార్కెట్ ఎప్పుడూ అధికుల అభిప్రాయాన్ని గౌరవించదనే విషయాన్ని గుర్తించాలి. తనంతట తాను నిర్దేశించుకున్న మార్గంలోనే ముందుకు సాగిపోతుంది. వాస్తవానికి గత 8 నెలలుగా మార్కెట్ దిద్దు'బాట'లో ఉంది. నిఫ్టీ 4700 పాయింట్ల నుంచి 5300 పాయింట్ల మధ్యలో... 600 పాయింట్లు పెరిగి పడిపోతోంది. సాంకేతికంగా చెప్పాల్సి వస్తే ఇది సాధారణమైన దిద్దుబాటే. కానీ అదే సమయంలో అసాధారణంగా అత్యధిక కాలం పాటు దిద్దుబాటు కొనసాగుతోంది. ఇది మదుపుదార్లు భరించలేని కాలమే. కానీ ఒకసారి పెరగడం ప్రారంభమైతే అది ఎంతో బలంగా, వేగంగా, అధికంగా ఉంటుంది.

భారత ఆర్థిక వ్యవస్థ స్థితిని ఇక్కడ గమనించాలి. ఆర్థికాభివృద్ధి ఎంతో ఆకర్షణీయంగా ఉంది. విదేశాల్లో చోటుచేసుకుంటున్న ఆర్థిక కల్లోలాల ప్రభావం మనదేశంపై కనిపించడం లేదు. అంతర్లీనంగా మన ఆర్థిక వ్యవస్థ బలాన్ని గుర్తించిన తెలివైన మదుపర్లు గుంభనంగా మంచి షేర్లు కొనుగోలు చేస్తూ పోతున్నారు. ఈ సానుకూలతను చూడలేని సాధారణ మదుపర్లే ఎక్కువగా కంగారుపడుతూ మార్కెట్‌కు దూరంగా ఉంటున్నారు. గౌతమ బుద్ధుడు చెప్పినట్లు.. 'ఇది కూడా గడిచిపోతుంది'. వాస్తవానికి ఐరోపా దేశాల్లో పడిన చిక్కుముళ్లు మన దేశానికి మంచే చేస్తాయి. విదేశీ మదుపర్లు గతంలోకంటే అధికంగా రక్షణాత్మకమైన మన ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడి పెట్టేందుకు మొగ్గు చూపుతారు. సంక్షోభ సమయమే స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేందుకు సరైన సమయం- అనేది తెలిసిందే కదా. ప్రస్తుతం మార్కెట్లో 10 శాతం రిస్కు, 100 శాతం అవకాశం కనిపిస్తున్నాయి. 2009 మార్చిలో దీర్ఘకాలిక 'బుల్ సైకిల్' ప్రారంభమైంది. ఇది వెనక్కి తిరగనిది.

'భారత వృద్ధి గాథ' ఎంతో పెద్దది. వినియోగం, పొదుపు... రెండూ ఉన్న వినూత్న ఆర్థిక వ్యవస్థ ఇది. వచ్చే 30 ఏళ్లలో ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 3వ స్థానంలో మనదేశం ఉంటుంది. ప్రపంచ ఉత్పత్తిలో 17 శాతం వాటా మనదే. ఇదేమీ సామాన్యమైన విజయం కాదు. 'ఈ శతాబ్దం మనదే' అనేందుకు ఇంతకు మించి ఉదాహరణ ఏం కావాలి. ఈ నేపథ్యంలో భారతీయ కంపెనీల షేర్లకు ఆకాశమే హద్దు. దీర్ఘకాలిక దృక్పథంతో మంచి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి గుండెల మీద చేయివేసుకొని హాయిగా ఉండొచ్చు.

(రచయిత ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్ డైరెక్టర్)